"తన భవిష్యత్తు శూన్యం కాకూడదని ఆనాడే నిర్ణయించుకుంటే అతనో పనిచేసుంటాడు."

ఆ మాటలన్న గొంతు నాకు కొత్త కాబట్టి జ్యోతి అందని వెంటనే కనిపెట్టాను.

"ఏం చేసుంటాడంటారు?" చాలా ఉత్సాహంగా అడిగాను.

"అతనూ చంబల్ లోయకు వెళ్ళుంటాడు"—

తడుముకోకుండా చెప్పింది.

ఆకాశంలో పెద్ద మెరుపు మెరిసింది.

అంత చీకట్లో అంత కాంతిని ఒక్కసారిగా భరించలేకో తెలియదు—ఆ మాటల వెనకాల భావానికో తెలియదు కాని నేను మాత్రం విపరీతంగా భయపడ్డాను.

* * *

[సక్సేనా లాంటి ఓదురదృష్టవంతుడికి....]

(జ్యోతి 1977)

---

# బతుకు భయం

అనసూయకి నిద్దట్లో మెలుకువ వచ్చింది. కళ్ళు నులుముకుని అటు ఇటు చూసింది. ఆ గదిలో తనుగాక తల్లి, చెల్లెలు, తమ్ముడు పడుకున్నారు. మిగిలిన ముగ్గురు హాయిగా నిద్రపోతున్నారు. అనసూయ చీర సవరించుకుని దుప్పటి సరిచేసుకుని పక్కకి ఒరిగి పడుకుంది. నిద్ర తేలిపోయింది.

అంతక్రితమే ఏదో పాడుకలో, పీడకలో వచ్చినట్టుగా కాస్తంత జ్ఞాపకంవుంది. ఆ కల రూపం ఏమిటో సరిగా గుర్తులేదు. పాడుకల అని మాత్రం తెలుసు. రాక్షసులు కాని, నాగుబాములు కాని కలలో కనబళ్లేదు. తను కొండ అంచున నుంచున్నట్టుగాని, నదిలో మునిగిపోయినట్టుగాని..... అలాంటిదీకాదు.

మరింకేవిటి ?

అనసూయ పూర్తిగా జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించింది. కలలో త్రిమూర్తులు కనిపించాడు. అదొక్కటే చాలు.... సీడకలేనని నిర్ధారించుకోడానికి....

చలి కొరికేస్తోంది. ఏస్బెష్టాస్‌రేకుల యింట్లోవుంటే అదే బాధ.... ఎండకాలం ఎంత వేడిగా వుంటుందో, చలికాలం అంత చలిగాను వుంటుంది. దుప్పటి తలపైదాకా లాక్కుని నిద్రపోవడానికి ప్రయత్నించి అనసూయ విఫలమైంది. ఆమెకు తల్లి జ్ఞాపకం వచ్చింది. ఆ వయసులో కప్పుకోడానికి కనీసం రగ్గయినా లేదు. తల్లికి రగ్గు కొనాలన్న తన ప్రయత్నం ప్రయత్నంగానే వుండిపోయింది.

'ఏదో వాడి చదువు పూర్తయి వాడోదారిన పడితే?' అనుకుంది అనసూయ.

ఏదారిన ?

'వాడూ అన్నయ్య దారిలోనే పడితే ?'

అనసూయకి భయం వేసింది. చెమట పట్టింది.

"కాదు. వాడలాంటివాడుకాదు" అనుకుంది. తమ్ముడి మీద ఆప్యాయత గుండె కింద తడిలా కదిలింది.

అంతలోనే ఆమెకి త్రిమూర్తులు జ్ఞాపకం వచ్చాడు. రాక్షసుడు, నాగుబాము. కొండ అంచు నదిలోతు....

గట్టిగా కళ్ళుమూసుకుని పడుకుంది. ఎప్పుడో తెలియకుండా నిద్ర పట్టేసింది.

* * *

అనసూయ పుట్టినప్పుడు సతీఅనసూయ మీద భక్తికొద్దీ తల్లి ఆమె కాపేరెట్టింది. అనసూయ తల్లి చాలా పురాణాలు వింది. చాలా పతివ్రతల కథలు చదివింది. ఆవిడకి భక్తి ఎక్కువ.

ఆమె పూజలు కాని, ఆమె విన్న పురాణాలు కాని, ఆమె అభిమానించిన పతివ్రతలు కాని ఆమె గుమస్తా భర్తని టిబి నుంచి రక్షించలేకపోయాయి. చావకుండా ఆపలేకపోయారు.

కాని అవే పురాణాలు ఆమెలో ధైర్యాన్ని నింపాయి. మొండితనం నేర్పాయి. ఆ ధైర్యంతోను మొండితనంతోను మొగుడు పోయినపుడు వచ్చిన కొద్దిపాటి డబ్బుతోను, వాళ్ళింట్లో, వీళ్ళింట్లో వంటలుచేసి, పప్పులు బాగుచేసిపెట్టి బియ్యం చెరిగిపెట్టి— రెక్కలు ముక్కలు చేసు కుని సంసారాన్ని ఈదింది.

పెద్దకొడుకు కాస్తోకూస్తో చదువుకుని, ఉద్యోగస్తుడై పెళ్ళి చేసు కుని ఓ ఇంటివాడైతే సంతోషించింది. తన రెక్కల కష్టం ఫలించిందని మురిసిపోయింది. కాని సంవత్సరం తిరిగేసరికి కొడుకు పెళ్ళాం కొంగు చాటు మనిషై తల్లిని, చెల్లెళ్ళని, తమ్ముణ్ని గాలికొదిలేసి— తన బతుకు తాను చూసుకుంటూ వెళ్ళిపోతే బాధపడింది. తల్లిపేగు ఎక్కడో లుంగ చుట్టుకుపోయింది. 'కొడుక్కి కృతజ్ఞతలేదు— పాడులోకం' అని మధన పడింది కాని అప్పుడు కూడా ఆమె అధైర్యపడలేదు. కష్టం చెయ్యడం నేర్చిన చేతులున్నాయి చీకట్లో చిరుదివ్వెలాంటి ఆశవుంది. కొండంత బాధ్యతవుంది. వీటివలన అనసూయ ఇంటర్ పాసవడం, టైపు హయ్యర్ పూర్తిచెయ్యడం, ఓ దూరపు చుట్టం సాయంతో హైద్రాబాద్‌లో ఓ చిన్న కంపెనీలో ఉద్యోగంలో చేరడం జరిగింది.

మకాం హైద్రాబాద్‌కి మారింది.

చిన్న కంపెనీలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ— పెద్ద కంపెనీలో పెద్ద ఉద్యోగం కోసం ప్రయత్నించవచ్చని ఆశపడింది అనసూయ. కాని ఆమె ఆశ ఫలించలేదు. ఆమె చిన్న కంపెనీలో చిన్న ఉద్యోగంలోనే వుండిపోయింది.

ఆ కంపెనీలో అనసూయ టైపిస్ట్‌గా పనిచేస్తున్నందుకు ఆరు వందల రూపాయలిస్తారు. దానితో ఆమె ఇంటి అద్దెకట్టి, బియ్యం,పప్పులు ఉప్పు, పాలు వగైరా నెలసరి సరుకులన్నీ కొనుక్కోవాలి.... దానిలోనే తమ్ముడు కాలేజీ ఫీజు, చెల్లెలికి, తమ్ముడికి పుస్తకాలు, బట్టలు, సరదాలు చట్టుబండలు అన్నీ అందులోనే గడుపుకోవాలి....

మొదట్లో తల్లి ఎవరింటోనో వంటచేసి ఇరవయ్యో, పాతికో తెచ్చేది. కాని రానురాను తల్లికి బెంగపెరిగి, ఆరోగ్యం క్షీణించి, కుడి చేతికి వణుకు రావడం ప్రారంభమైంది. అంచేత ఆమె వంటలకు వెళ్ళ లేకపోతుంది. వేణ్నీళ్ళకి చన్నీళ్ళుగా తోడుపడే ఆమె సంపాదన లేదు.

నగరజీవితం, పెరుగుతున్న ఖర్చులు, పెరగని సంపాదన.... అనసూయ జీవితం ఇబ్బడిముబ్బడిగా వుంది. కాని అనసూయ అధైర్య పడదు. ఆమెకు రేపు మీద కొండంత ఆశ....

నగరజీవితంలో మిగిలిన ఖర్చులన్నీ ఒక ఎత్తు ఇంటి అద్దె ఒక ఎత్తు....

* * *

ఆ పేటలో త్రిమూర్తులంటే తెలియని వారుండరు ఎభైఅయిదేళ్ల త్రిమూర్తులు మంచి బలంగా, ధృఢంగా, నిటారుగా నడుస్తూ మంచి ఆరోగ్యంగా వుంటాడు. అతనికి అంత వయసుంటుందంటే ఎవరూ నమ్మరని అతనే అంటూంటాడు. ఆ మాట నిజం కూడా.... శరీరబలమే కాకుండా, మంచి ఆర్థిక బలం కూడా వుండడంవలన అతను మరింత ఆరోగ్య వంతంగా కనిపిస్తాడు. అతనికి సంసారపరమైనవి కాని మరేవి కాని సమస్యలులేవు— అంచేత ఆనందంగాను, హుషారుగాను వుంటాడు.

ఆ పేటలో జనసంచారం ఎక్కువగా లేని రోజుల్లో త్రిమూర్తులు చౌకగా రెండువేల గజాల స్థలం కొన్నాడు. నగరం పెరిగి అందులో జనాభా పెరిగి, ఇళ్ళకి గిరాకీ పెరిగి — అద్దెలు బాగా వస్తున్నాయనిపించగానే అందులో వెయ్యి గజాల స్థలం అమ్మేసి—బోలెడంత డబ్బు సంపాయించి— దాంతో పెద్ద యిల్లు వాటాలు వాటాలుగా కట్టాడు. ఆ వాటాలన్నీ అద్దెకిచ్చాడు. అతనికి నెల తిరిగేసరికి మూడువేల రూపాయలదాకా యింటి అద్దెలు వస్తాయి.

త్రిమూర్తులు యిల్లు కట్టినపుడు— ఇనుము, సిమెంటు రేకుతో ఓ గది కట్టించాడు. యిల్లుకట్టడం పూర్తయ్యాక ఆ గదిలో నేల సిమెంటు చేయించి పక్కనే బాత్రూం కట్టించి— అద్దెకిచ్చాడు.

అనసూయ కుటుంబం ఆ గదిలో అద్దెకున్నారు. దానికి నెలకి నూట పాతిక రూపాయలు అద్దె.

అనసూయకు అంత అద్దె భరించడం కష్టమే— కాని తప్పదు పెద్ద మగదిక్కులేని సంసారం మరీ రోడ్ మీదకి వుంటే బోలెడన్ని సమస్యలకు గురికావల్సివస్తుంది. ఈ గది లోపలకి వుంది కొంచెం రక్షణగా వుంటుంది. అంతేకాకుండా అక్కణ్నుంచి ఆమె ఆఫీసుకి, తమ్ముడి కాలేజీకి, చెల్లెలు స్కూలుకి దగ్గర. ముగ్గురికి సిటీబస్ ఖర్చుమిగుల్తుంది.

అనసూయకి జీతంలో ఖర్చులన్నీ పోను ఇరవై రూపాయలు మిగుల్తాయి. దానితో నెలంతా కూరలు వగైరా దినసరి ఖర్చులన్నీ గడవాలి. ఆఖరివారంలో పాతిక, ముప్పై రూపాయలు అప్పు అవుతుంది. తనతో పాటు పనిచేసే సుభాషిణి దగ్గర అప్పుతీసుకుని మళ్లీ జీతంరాగానే తీర్చేస్తుంది.

మామూలు ఖర్చులు కాకుండా నెలలో ఏ పేరంటమనో, ఎవరిదో పుట్టిన రోజనో, ఓ చిన్న బహుమతి కొనాల్సిరావడం, లేదా తల్లికి అనారోగ్యం ఎక్కువై డాక్టర్ దగ్గరికి తీసికెళ్లడం లాంటివి జరిగితే మరింత అప్పు అవుతుంది. దాని ప్రభావం వచ్చేనెల, ఆ తర్వాతనెల, ఆపై.... అలా సాగుతూనే వుంటుంది. సాయంత్రాలు ఏ పార్టుటైం ఉద్యోగమైనా చేద్దామంటే కనీసం రెండు వందలు ఇస్తేకాని గిట్టుబాటుకాదు. వెళ్లడం, రావడంలాంటి ఖర్చులన్నీ వుంటాయి. అయినా వందకి, నూటఏభై కి పుల్ టైం టైపిస్టులు దొరికే నగరంలో పార్టుటైం ఉద్యోగం ఎవరిస్తారు ?

అనసూయ పనిచేస్తున్న కంపెనీ చిన్నది. అంచేత ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్లివ్వడం, డి. ఎ. పెంచడంలాంటివి వుండవు.

ఇలా ఎక్కడికక్కడ ఖర్చులు తగ్గించుకుంటూ జీవితాన్ని కత్తిరించుకుంటూ, సంసారాన్నిలాక్కొస్తున్న అనసూయకి ఒక కొత్త సమస్య ఎదురైంది.

ఆవేళ అద్దెవసూలు చేసుకోడానికి వచ్చిన త్రిమూర్తులు "చూడమ్మా మీరీ ఇంట్లోకి వచ్చి సంవత్సరం దాటింది. అప్పట్నుంచి అద్దె పెంచనే లేదు. నాకూ ఖర్చులన్నీ పెరిగిపోయాయి. నూనె కిలో పదిహేడు రూపాయలు అమ్ముతోంది. అంచేత ఓ ఏభై రూపాయలు అద్దె పెంచండి" అన్నాడు.

అనసూయకి మతిపోయింది. తల పేలిపోయింది. గుండె జారిపోయింది. కాళ్ళు వణికాయి శ్వాస ఆగిపోయింది. నరాలు చిట్లిపోతున్నట్లుగా అనిపించింది. తన గుండె మీద ఎవరో సమ్మెటదెబ్బలు వేస్తున్నట్లుగా వుంది.

ఎన్నో బాధలు, ఎన్నో వేదనలు, ఎన్నో రుగ్మతలు ఆమెను చుట్టుముట్టాయి. పాములు కరిచేసాయి. తేళ్ళు కుట్టేసాయి, పులులు, సింహాలు మీద కురికాయి. ఇన్ని బాధల్నుంచి తేరుకోడానికి ఆమెకు కొన్ని క్షణాలుపట్టింది. తేరుకున్నాక—

చూడండి మీరు పెద్దవారు మా సమస్యలు మీకు తెలుసు....ఆడదాన్ని ఒక్కదాన్ని సంసారం లాక్కొస్తున్నాను. ఎదుగూ బొదుగూ లేని జీతం ఒక్కసారిగా ఏభై రూపాయలు పెంచితే భరించలేను. భరించగలిగితే ఏభై కాదు, వంద....వంద పెంచుదును. మీ ఇంట్లో ఓ మూల తలదాచుకోనిచ్చినందుకు ఎంతైనా ఇద్దును....కాని అది నా సాధ్యంకాదు నావల్ల కాదు మీరు దయతలచాలి. మీరు కరుణించాలి. పెద్దవారు మీకు చెయ్యెత్తి దణ్ణం పెడుతున్నాను" అంది.

త్రిమూర్తులు చిర్నవ్వు నవ్వాడు.

"అలాకాదు, ఈ ఏరియాలో అద్దెలు ఎలా వున్నాయో ఒక్కసారి నువ్వే వాకబు చెయ్యి. ఇంతకన్నా తక్కువకి కాదు— రెండు వందలకి తక్కువలో నీకు అలాంటి గది దొరికితే— నేనీనీకు ఊరికే ఇస్తాను. ఆలోచించు!" అని వెళ్ళిపోయాడు.

అనసూయకి ఆ రోజు నుంచి బెంగ మొదలైంది.

ఏ రకంగా ఆలోచించినా, ఎన్ని లెఖలు వేసినా ఏభై రూపాయలు అద్దె పెంచే విధానం కనబళ్ళేదు ఆ విషయం నిర్ధారణఅయ్యేక వేరే గది కోసం ప్రయత్నించడం మొదలెట్టింది.

ఊరికి దూరంగా—నగర శివార్లలోవున్న ఇళ్ళకు అద్దెలు తక్కువ కాని ఆమె, తమ్ముడు, చెల్లెలు ముగ్గురు సిటీబస్సుల్లో రావాలి. దానికయ్యే ఖర్చు ఇంకా ఎక్కువగా వుంటుంది. తను ప్రస్తుతం వుంటున్న పేట లోను, పక్కప్రాంతాలలోను వాకబుచేస్తే అలాంటి గదికే రెండువందలు పైగా అడుగుతున్నారు.

తన స్నేహితురాళ్ళను సలహా అడిగితే గది మారటంకన్నా అద్దె పెంచడమే మంచిదని చెప్పారు కాని పెంచే విధానం కనబడ్డంలేదు.

అనసూయ చిత్రమైన సమస్యలో చిక్కుకుంది. అలాంటి సమస్యలకు పరిష్కారం దొరకదు. మధనపడటమే మిగుల్తుంది.

పదిహేనురోజులుపోయాక త్రిమూర్తులు మెయిన్‌గేటులో ఎదురు బడి "ఏం నిర్ణయించుకున్నావ్ ?" అనడిగాడు.

"అద్దె పెంచనూలేను. మరో ఇంటికి మారలేను. మీరే దయతల చాలి" అంది అనసూయ.

త్రిమూర్తులు నవ్వాడు కప్పను చూచి పాము నవ్వినట్టు నవ్వాడు. మిటతను చూచి తొండ నవ్వినట్టు నవ్వాడు. ఇంట్లో అద్దెకున్నవాణ్ణిచూసి యింటి ఓనరు నవ్వినట్టు నవ్వాడు.

"ఆ విషయం వదిలెయ్....మాకు మీరుంటున్న గది కావాలి.వచ్చే వేసవికాలంలో మా చిన్నాడికి పెళ్ళి చేద్దామనుకుంటున్నాను...."

త్రిమూర్తుల్ని అనసూయ మధ్యలోనే ఆపింది.

"మీరు పెంచమన్నట్టె ఏభై రూపాయలు పెంచుతాను. దయుంచి మమ్మల్ని ఖాళీచేయమనకండి ప్లీజ్...." అంది.

ఆ క్షణంలో ఏభై రూపాయలు ఎలా పెంచగలనని ఆమె ఆలోచించలేదు. అంతకన్నా చిన్న గదికి రెండు వందలకు పైగా అద్దె పెట్టాలన్న విషయమే మనసులో మెదిలింది.

"అబ్బెబ్బె....అదికాదు. మా చిన్నాడిది పెళ్ళి చేద్దామనుకుంటున్నాను. నేనుంటున్న వాటా అందరికీ సరిపోదు.

మేడ మీదనే కొత్తగా కడుతున్న గది తీసుకుని నీ బెడ్ రూం చేసుకోరా అంటే మా చిన్నాడు వినడంలేదు. మీరుంటున్నగది పెరట్లో మూలగా అవుట్ హౌస్‌లా వుంది. అదే కావాలంటున్నాడు ఎంత చెప్పినా వినడంలేదు కాలంమారిపోయింది. పిల్లలు మనం చెప్పినట్టు వినరు....

కంగారేంలేదు. రెండు నెలలలో వీలుచూచుకుని మారండి. అంతదాకా నూటపాతికే ఇయ్యి అద్దె పెంచక్కర్లేదు" అని వెళ్ళిపోయాడు.

అనసూయకి తననెవరో పీక నులిమి చంపెయ్యడానికి ప్రయత్నిస్తున్నట్టుగా అనిపించింది—అంతే!

ఆ గదికి రెండొందలు పైగా అద్దెవస్తున్న విషయం జ్ఞాపకం వచ్చి త్రిమూర్తులు ఆనందంగా ఒళ్ళు విరుచుకున్నాడు—లోపలగదిలో—

ఇంట్లోకి రావడం రావడం అనసూయ చాపమీద బోర్లా పడుకుని కుళ్ళికుళ్ళిఏడ్చింది. కారణం అడిగిన తమ్ముణ్ణి, చెల్లెల్ని, తల్లిని కసురుకుంది. ఆమె మనసును బతుకుభయం కమ్ముకుంది.

మళ్ళీ మర్నాటినుంచి ఇంటివేట మొదలైంది. కనీసం ముగ్గురు పడుకునే జాగా, ఓ మూల వంటచేసుకునేవీలు వున్నగది కావాలి. దగ్గర్లో కావాలి. కాస్తంత రక్షణగా వుండే గదికావాలి ఇరుగుపొరుగు మంచివారై వుండాలి. అద్దె తక్కువగా వుండాలి.

ఎంత తిరిగినా దొరకలేదు. పది రోజులు, పదిహేను రోజులు,

నెల రోజులు....రోజూ అనసూయ, తల్లి, చెల్లెలు, తమ్ముడు ఇంటికోసం వేటాడుతూనే వున్నారు.

ముఖ్యంగా భరించలేనంత అద్దెకారణం-ఏదో ఒకరోజు త్రిమూర్తులు వచ్చి "ఏం చేసావ్?" అనడుగుతాడు. త్రిమూర్తులు మేడమీద కడుతున్న గది పూర్తయింది.

"వాళ్ళ చిన్నవెధవ ఆ గది తీసుకోవచ్చుగా— వెధవకి కొత్త పెళ్లాంతో కులకడానికి మూలగా, ఔట్ హౌస్‌లావున్న గది కావల్సి వచ్చిందా!" అనుకుంది అనసూయ.

తన ఆలోచనకి తనకే నవ్వు వచ్చింది.

'అసలిదేం కాదు. నన్ను ఖాళీ చేయించి ఎక్కువ అద్దెకు వేరే వాళ్ళకు ఇవ్వొచ్చుకదాని ముసలాడి ప్లాను' అనుకుంది.

మర్నాడు త్రిమూర్తులు రానేవచ్చాడు.

"ఇంటికోసం వెతుకుతున్నాను. దొరకలేదు. దొరగ్గానే వెళ్ళిపోతాం" అని చెప్పింది అనసూయ ఆమె మాటల్లో నిష్ఠూరం వుంది బాధ వుంగి. కోపం వుంది.

ఆమె మాటలకు త్రిమూర్తులు నవ్వాడు. కిలకిల నవ్వాడు. టకటకా నవ్వాడు. చకచక నవ్వాడు. పకపక నవ్వాడు.

"నేనందుకు రాలేదు" అన్నాడు.

"మరి?"

"మీరు ఇల్లు ఖాళీచెయ్యక్కర్లేదు మా చిన్నాడు మేడమీద గది తీసుకుంటానన్నాడు" అన్నాడు.

"మరి అద్దె...."

"పెంచక్కర్లేదు పూర్వంలానే నూటపాతిక ఇయ్యి. కావాలంటే పదో, పదిహేనో తగ్గించి ఇయ్యి— వెధవది డబ్బు శాశ్వతమా? ఏదో

ఆడపిల్లవి. కష్టపడి సంసారం ఈదుతున్నావు. నిన్ను చూస్తే జాలి.... అంతే!" అన్నాడు.

అనసూయ తన చెవుల్ని తానే నమ్మలేకపోయింది. పెద్దపులి కాషాయాంబరాలు ధరించి, కమండలం చేతపట్టుకుని హరినామస్మరణ చేస్తూ, శాఖాహారియై బతకడానికి నిశ్చయించు కున్నట్టుగా అనిపించింది.

రెండు చేతులు ఎత్తి దణ్ణం పెట్టింది.

నాలుగురోజుల తర్వాత టాపులేని బాత్రూంలో స్నానంచేసి గోడ మీదున్న తువ్వాలు తీసుకుంటూ అనసూయ యధాలాపంగా పైకి చూసింది—— ఆమె ఆశ్చర్యపోయింది. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. భయం వేసింది.

మేడమీద కొత్తగా కట్టిన గది గోడదగ్గర నిలబడి త్రిమూర్తులు కళ్ళప్పగించి టాపులేని బాత్రూంలోకి, అనసూయ నగ్నశరీరంకేసి చూస్తు న్నాడు.

ఆమె సిగ్గుతో కుంచించుకుపోయింది.

తువ్వాలు లాక్కుని చటుక్కున గొంతుక్కూర్చుంది. అలాగే వళ్లు తుడుచుకుని బట్టలు వేసుకుంది.

'ఇందుకా వెదవ యిల్లు ఖాళీచేయక్కర్లేదన్నాడు, పైగా అద్దెకూడా పెంచక్కర్లేదన్నాడు. ముసలినక్క ఇలాఎన్నాళ్ళనుంచి చూస్తున్నాడో?' అనుకుంది అనసూయ.

ఆరోజు అనసూయ త్రిమూర్తుల్ని నోటికొచ్చిన తిట్లన్నీ తిట్టింది. కానీ అన్నీ మనసులోనే....

ఎవరికీ చెప్పుకోలేని విషయం ఇది.

'ఛీ వీడిల్లూ ఒద్దు—— వీడి శ్రాద్ధం ఒద్దు. ఇల్లు మారిపోవాలి' అనుకుంది.

ఆ రాత్రంతా ఆలోచించింది, మళ్ళీ ఇంటిఅద్దెలు జ్ఞాపకం వచ్చాయి

తన జీతం జ్ఞాపకం వచ్చింది. తమ్ముడి చదువు, తల్లి వైద్యం.... ఖర్చులు, ఖర్చులు, ఖర్చులు.... అన్నీ జ్ఞాపకం వచ్చాయి.

ఆ రాత్రి పీడకలలు, పాడు కలలు వచ్చాయి. 'ఏమైనా సరే— ఇల్లు మార్చలేను' అని నిర్ణయించుకుంది.

'అప్పుడు సతీఅనసూయని పరీక్షించడానికి త్రిమూర్తులు వచ్చి నగ్నంగా అన్నం వడ్డించమన్నారట ఈ వేళ ఈ త్రిమూర్తులుగాడు నా దరిద్రాన్ని పరీక్షిస్తున్నాడు— నాక్కూడా ఆమెలాగే మహిమలుంటే' అనుకుంది.

తన ఆలోచనలకి తానే నవ్వుకుంది.

'ఈ కాలంలో మహిమలన్నీ డబ్బులో వున్నాయి. డబ్బు వుంటే అన్ని పవిత్రతలు, పాతివ్రత్యాలు కుదుర్తాయి' అనుకుంది ఆమె.

మర్నాడుదయమే బాత్రూంకేసి వెడుతూ మేడమీదకి చూసింది. ముసలినక్క అక్కడే తచ్చాడుతున్నాడు—

'దొంగవెధవ' అనుకుంది.

బాత్రూంలోకెళ్ళి గొంతుకూర్చుని బట్టలు తీసేసి అట్లాగే నీళ్ళు పోసుకోవడం మొదలెట్టింది. అంతలో ఆమెకు అనుమానం వచ్చింది.

'వెధవ— వాడికోరిక తీరడంలేదని మళ్ళీ ఇల్లు ఖాళీ చేయమంటాడేమో? బతకడం కోసం, కేవలం బతకడం కోసం ఎంతమంది ఎన్ని వెధవ పనులు చెయ్యడంలేదు? ఇదో లెఖ్ఖా?' అనుకుంది అనసూయ.

ఆ క్షణంలో బాధ, సిగ్గు, అవమానం. డబ్బుతో ముడిపడ్డ బతుకు భయం ఆమెను చుట్టుముట్టాయి. పాములు కరిచేసాయి, తేళ్ళు కుట్టేసాయి. సింహాలు, పులులు మీదకురికాయి.... ఎన్నో బాధలు, ఎన్నో వేదనలు, ఎన్నో రుగ్మతలు....

లేచి నిలబడి ఎటో చూస్తూ నీళ్ళు పోసుకోవడం మొదలెట్టింది. ముసలినక్క గోడపక్కన చేరి మునికాళ్ళమీద నిలబడి, కళ్ళు ఇంతింత చేసుకుని, ఆబగా, ఆశగా, అసహ్యంగా కోరికతో.... చూస్తూనేవున్నాడు.

(స్వాతి మార్చి 84)